క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే మేడా రాక

వీరబల్లి : సుండుపల్లె మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు పింఛన్ వారోత్సవాలలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. అనంతరం వీరబల్లి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నూతన పింఛన్ లబ్ధిదారులకు పెంచిన మొత్తంతో పింఛన్‌ను ఎమ్మెల్యే పాల్గొని అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ప్రతి పిల్లవాడికి తట్టు సూది వేయించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఉషశ్రీ

లక్కిరెడ్డిపల్లె : పుట్టిన ప్రతి పిల్లవాడికి తట్టు సూది తప్పనిసరిగా వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ ఉషశ్రీ పేర్కొన్నారు. బుధవారం కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి బిడ్డకు టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. పుట్టిన బిడ్డ నుంచి 16 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా తట్టు సూది వేయించాలన్నారు. ఆయా గ్రామ సచివాలయాలలో గర్భిణులు, బాలింతలను అక్కడికి పిలిపించి వివరాలు నమోదు చేసుకొని టీకాలు వేయాలన్నారు. బూస్టర్ టీకా 15 సంవత్సరాల వరకు వేయవచ్చని అన్నారు.

ఓటర్ల జాబితాలో మరణించిన వారి పేర్లను తొలగించండి

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామ సచివాలయం పరిధిలో మృతి చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని సిద్దవటం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు మల్లు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ప్రస్తుతం అధికారులు విడుదల చేసిన ఓటర్ జాబితాలో 70 మంది మరణించిన వారి పేర్లు ఉన్నాయని వాటిని తొలగించాలని ఆయన కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని గద్దగుండ్ల రాచపల్లి వద్ద నామాలగుట్టపై నిర్మిస్తున్న శ్రీధర్మశాస్త్ర ఆలయ నిర్మాణానికి రామాపురం మండల విద్యుత్ శాఖ ఏఈ వరప్రసాద్ రెడ్డి బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ చెల్లు గంగరాజుకు రూ. 10 వేలు విరాళంగా అందజేశారు. గాలివీటి సురేంద్రరెడ్డి, సుధీర్ కుమార్, నాగేంద్రబాబు, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, జగన్‌మోహన్ రెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు.

తైక్వాండో జట్టు మేనేజర్‌గా విజయభాస్కర్



రాజంపేట టౌన్ : ఈనెల 9వ తేదీ నుంచి అమృత్‌సర్‌లో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ తైక్వాండో పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల మహిళా జట్టుకు రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మేజర్ విజయభాస్కర్ మేనేజర్‌గా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని బుధవారం ఆయన ఇక్కడి విలేకరులకు తెలిపారు. యోగివేమన యూనివర్శిటీ తరపున మహిళా జట్టుకు యూనివర్శిటీ అధికారులు తనను మేనేజర్‌గా ఎంపిక చేశారన్నారు. తనపై అధికారులు నమ్మకం ఉంచి అప్పచెప్పిన బాధ్యతలను సమర్థవంతగా నిర్వహిస్తానన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

చిన్నమండెం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో నేడు కొత్త పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ దివ్య ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పులిరామ్‌సింగ్

సిద్దవటం : మండలంలోని జంగాలపల్లె గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రం లోని పిల్లల హాజరు పట్టికను పరిశీలించారు. పలు వివరాలను అంగన్వాడీ వర్కర్ మాధవిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

పనులను నాణ్యతగా చేయండి

సంబేపల్లె : పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయ భవన నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని గుత్తేదారులకు ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పశువైద్యశాల ప్రాంగణంలో రూ.80 లక్షలతో చేపడుతున్న నిర్మాణ పనులను ఆయన పరిశీలించి గుత్తేదారులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలో గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, పథకాల మంజూరులో పూర్తిస్థాయిలో పారదర్శకత పాటిస్తున్నామని చెప్పారు. ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మూడేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు వివరించి, ఇంకా ఎవరికైనా అర్హత ఉండి అందకపోతే అధికారులతో మాట్లాడి అక్కడిక్కడే పరిష్కరించామన్నారు. కోడూరు నియోజకవర్గంలో కొత్తగా జనవరి మాసంలో 970 పెన్షన్లు మంజూయ్యాయని తెలిపారు. అలాగే 2014లో చంద్రబాబు కేవలం 38లక్షలు పెన్షన్‌లు వెయ్యిరుపాయలతో ఇచ్చారని, కాని ఈ రోజు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 64లక్షల పెన్షల్లు ఇస్తున్నామని తెలియజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలు సంక్షేమ పథకాల బోర్డులను వీక్షించే విధంగా అందుబాటులో ఉంచాలని సిబ్బందికి తెలియజేశారు. ఏ గడప తొక్కినా ప్రజాదరణ అపూర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెట్పీటీసీ రత్నమ్మ, ఉప సర్పంచ్ తోట శివసాయి, ఎంపీటీసీ మహేశ్వర్‌రెడ్డి, వార్డు మెంబర్ రామచంద్రయ్య, ఎంపీడీఓ నాగార్జున, సీహెచ్.రమేష్, రౌఫ్, మండల శివయ్య, వైఎస్ కరీముల్లా, శివయ్య, పుష్పలత, సావిత్రమ్మ, కొప్పల శంకరయ్య, ప్రసాద్, వినోద్‌ఖన్నా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

40 సంవత్సరాలు రాజకీయ అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు తన స్వార్థ రాజకీయ లబ్ధి కోసం అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని కొరముట్ల పేర్కొన్నారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ 2024లో జరగబోయే ఎన్నికలకు తెలుగుదేశం పార్టీకి కనీసం అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతుందని విమర్శించారు. చంద్రబాబు ఎక్కడ అడుగుపెడితే అక్కడ ప్రాణనష్టం జరుగుతుందని గుర్తుచేశారు. చంద్రబాబు చెప్పే అబద్ధపు మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. చంద్రబాబు తన పచ్చమీడియాతో కలిసి ప్రభుత్వంపై బురదజల్లేందుకు విష పురాతలు రాయిస్తున్నారని దుయ్యబట్టారు.

ప్రభుత్వ ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనాలి

– రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి



షీల్డ్ అందిస్తున్న కొండూరు అజయ్‌రెడ్డి

పెనగలూరు : ప్రభుత్వ ఉద్యోగులు క్రీడా పోటీల్లో పాల్గొనాలని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. మండలంలో సచివాలయ సిబ్బందికి గత నాలుగు రోజులుగా వివిధ రకాల ఆటలు పోటీలను నిర్వహించారు. మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా ఈ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అజయ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులతోపాటు ప్రభుత్వ ఉద్యోగులూ క్రీడా పోటీలలో పాల్గొని తమ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. వచ్చే ఉగాదికి సచివాలయ సిబ్బందితోపాటు మండలంలో పనిచేసే అన్నిశాఖల ఉద్యోగులకూ అన్ని రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. గెలుపొందిన వారికి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మన్నూరు సచివాలయం ఆకస్మిక తనిఖీ

రాజంపేట టౌన్ : పట్టణంలోని మన్నూరు సచివాలయాన్ని బుధవారం డీఎల్‌డీఓ బి.ఎస్.మూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఆ సచివాలయ పరిపాలన అధికారి గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సత్వరమే మెరుగైన సేవలు అందించేందుకు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చారని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది విశేష కృషి చేసినప్పుడు సీఎం లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ డీఈఈ మురళీకృష్ణ పాల్గొన్నారు.

కబడ్డీ చాంపియన్‌షిప్ పోస్టర్ విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఈఓ రాఘవరెడ్డి తదితరులు

రాయచోటి టౌన్ : రాయచోటిలో జిల్లా స్థాయి కబడ్డీ చాంపియన్‌షిప్ పోస్టర్లను డీఈఓ రాఘవరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే సంకల్పంతో ఆటలను నిర్వహిస్తున్నామని ప్రోగ్రాం ఆర్గనైజర్ వినయ్‌కుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 6281453550కు ఫోన్ చేసి టీం నమోదు చేయాలన్నారు. పోటీలు ఈ నెల 30 నుంచి మూడు రోజులపాటు పట్టణంలోని ఐకె ఒలంపియాడ్ స్కూల్ గ్రౌండ్‌లో జరుగుతాయన్నారు.

'కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలి'



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయచోటి అర్బన్ : సావిత్రీబాయి పూలే ఆశయమైన సమాజంలో సమాన విద్యావకాశాల కోసం ప్రభుత్వం వెంటనే కామన్ స్కూల్ విధానాన్ని తీసుకురావాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి వారోత్సవాలలో భాగంగా బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ అత్యుత్తమ సమాజం నిర్మించాలంటే అందరికీ సమాన విద్య అందాలన్నారు. సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకుని విద్యా రంగంలోని కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ ఆలోచనలను తిప్పికొట్టి అందరికి విద్య, సమాన అవకాశాలు కల్పించేందుకు సామాజిక ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గోపాల్‌నాయక్, నేతలు సురేంద్ర, ప్రసాద్, కిఫాయత్, రఫీక్, అమీన్ తదితరులు పాల్గొన్నారు.

చక్రపాణిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి



చక్రపాణిరెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి

చిట్వేలి : చక్రపాణిరెడ్డి మృతి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి తీరనిలోటని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చక్రపాణిరెడ్డి స్వగ్రామం మైలపల్లిలో బుధవారం ఆయన సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కరుణాకర్ రెడ్డి మృతుడు చక్రపాణిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే రైల్వేకోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు, మోహన్ రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, ఎంపీపీ చంద్ర, ధ్వజారెడ్డి, డేవిడ్ ప్రసాద్ తదితరులు చక్రపాణిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, సన్నిహితులు పాల్గొని నివాళులు అర్పించారు.

వ్యవసాయశాఖ నూతన కార్యవర్గం ఏర్పాటు



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక రాయచోటిలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా కె.నవీన్ కుమార్ రెడ్డి, సెక్రటరీగా కె. రమేష్ బాబు రావు, కోశాధికారిగా బి.వెంకటమోహన్, ఉపాధ్యక్షులుగా జి.సుధాకర్, గౌరవ అధ్యక్షులుగా జి.రమేష్ బాబు, గౌరవ సలహాదారులుగా రమణ కుమార్, శ్రీలతలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ పర్యవేక్షించారు. అనంతరం నూతన కమిటీ నాయకులను ఘనంగా సన్మానించారు.

డగ్‌ఔట్ పాండ్ పనుల పరిశీలన



పాండ్ పనులను తనిఖీ చేస్తున్న ఏపీడీ రవికుమార్

రాయచోటి టౌన్ : డగ్‌ఔట్ పాండ్ పనులను అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రవికుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. బుధవారం రాయచోటి రూరల్ పరిధిలోని మాధవరం గ్రామంలో సైకంవాండ్లపల్లె పంట పొలాల వద్ద ఉపాధి హామీ కూలీలు చేపట్టిన డగ్‌ఔట్ పాండ్ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ అధికారులతో మాట్లాడి పనుల కొలతలపై రాజీ పడరాదని సూచించారు. కూలీలకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు.

గురువు సూచనలతో వృత్తిలో సఫలీకృతం



బహుమతులను అందజేస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : గురువుల సూచనలను పాటిస్తే విద్యార్థులు వృత్తిలో సఫలీకృతమవుతారని ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అన్నారు. బుధవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి పట్ల అధ్యాపకులతో పాటు తల్లిదండ్రుల పర్యవేక్షణ సహకారం ఉండాలన్నారు. విద్యార్థికి ఆధునిక విద్య, వృత్తి జ్ఞానం పెంపొందాలన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదు

పీలేరు రూరల్ : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తిరుపతి, చిత్తూరు రోడ్డు, కడప రోడ్డు మార్గంలో సర్పంచ్ హబీబ్‌బాషాతో కలసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ఎక్కడపడితే అక్కడ మద్యం సేవించడం, బాటిల్లు పడేయడం లాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవో రెడ్డిప్రసాద్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

విశ్వసనీయతకు నిదర్శనం పింఛన్ల పెంపు

- పండుగ వాతావరణంలో పింఛన్ల వారోత్సవాలు
- హాజరైన ప్రజాప్రతినిధులు నాయకులు



సంబేపల్లె: లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ



ఓబులవారిపల్లె: కొర్లకుంటలో నారాయణమ్మకు పింఛన్ అందిస్తున్న సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేర పింఛన్‌ను రూ.2750కు పెంచామని ఏపీటీడీసీ డైరెక్టర్ వి.సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పింఛన్ వారోత్సవాల్లో భాగంగా కొర్లకుంట గ్రామంలో నూతన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. గత ప్రభుత్వంలో ఎవరైన చనిపోతే తప్ప కొత్త పింఛన్‌లు ఇచ్చేవారు కాదని ప్రస్తుతం అర్హులందరికి పథకాలు మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలోని ముక్కా నారాయణమ్మ గృహానికి వెళ్లి పింఛన్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీటీసీ రోహిణి కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ రూపేష్‌కుమార్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శి రఘురామరాజు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పథకమైన నవరత్నాలలో భాగమైన సామాజిక పింఛన్ల పెంపు ప్రభుత్వ విశ్వసనీయతకు నిదర్శనమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన పింఛన్ వారోత్సవాలలో భాగంగా కొత్త పింఛన్లను లబ్ధిదారులకు ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మీతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి మాసం నుండి పెంచిన రూ.250తో పింఛన్ మొత్తం రూ.2,750 లబ్ధిదారులకు అందజేశామన్నారు. అదే విధంగా మండల వ్యాప్తంగా అర్హత కలిగిన 145 మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహులు, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి పింఛన్లు మంజూరు

నందలూరు(రాజంపేట) : అర్హులందరికి పింఛన్లు మంజూరయ్యాయని జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి అన్నారు. బుధవారం నల్లతిమ్మాయపల్లె సచివాలయంలో నూతన పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పింఛన్ల విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు చేకూరే విధంగా సంక్షేమ కార్యక్రమాలను తీసుకొచ్చారన్నారు. చెప్పిన మాట మేరకు సీఎం పింఛను పెంచి ఇచ్చారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గీతాల శిరీషా నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జీవీసుబ్బారెడ్డి, గీతాల నరసింహారెడ్డి, ఈగసుబ్బారెడ్డి, నరసారెడ్డి, సచివాలయం కన్వీనరు గడికోట దివాకర్, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

గాలివీడు : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ నవరత్నాలలో భాగంగా సంక్షేమ పథకాలు అందిస్తుందని మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి తెలిపారు. అరవీడు గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సచివాలయంలో లబ్ధిదారులకు మంగళవారం సాయంత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారన్నారు.



రాజంపేట: నల్లతిమ్మాయపల్లె పింఛన్ పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి



గాలివీడు: లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి

నేటి నుంచి గుండ్లమూలలో రీసర్వే

సిద్దవటం : మండలంలోని గుండ్లమూలలో గురువారం నుంచి వైఎస్ఆర్, జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీసర్వే చేపట్టనున్నట్లు సిద్దవటం తహసీల్దారు శంకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎస్.రాజంపేట పంచాయతీలో వైఎస్ఆర్, జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీసర్వే పూర్తయిందని, రైతులకు భూహక్కు పత్రాలను అందజేయనున్నట్లు తెలిపారు. గుండ్లమూల గ్రామంలో మండల సర్వేయర్ సుధాకర్, గ్రామ సర్వేయర్ల బృందం, వీఆర్‌ఓలు గ్రామంలో రీసర్వే నిర్వహిస్తారన్నారు. రైతులు సర్వే బృందానికి సహకరించి, తమ భూములకు సంబంధించిన పత్రాలను సర్వే బృందానికి ఇచ్చి సహకరించాలని ఆయన కోరారు.

ఆక్రమిత స్థలాలు గుర్తింపు

రామసముద్రం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని చెంబకూరు బస్టాండ్ ఆవరణంలో ఆక్రమిత స్థలాలను బుధవారం డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించారు. ఇటీవల మండలానికి వచ్చిన కలెక్టర్ చెంబకూరులో సచివాలయం ఆవరణంలో దురాక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తహసీల్దార్ విశ్వేశ్వరశాస్త్రీ తెలిపారు. ఈ మేరకు డ్రోన్‌తో చిత్రీకరించిన చిత్రాలపై స్పష్టత ఎంత వరకు ఉందని కలెక్టర్‌కు పంపించి ఆపై వచ్చిన నివేదికను తెలియచేస్తామన్నారు. అనంతరం చెంబకూరులోని 31వ నెంబరు గల రేషన్‌షాపును తనిఖీ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కలకడ : నలుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీటి స్వామి తెలిపారు. బుధవారం మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీ బొంతలవారిపల్లె పెద్ద వంక వద్ద పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో ఎస్ఐ తనసిబ్బంది తో దాడులు నిర్వహించి, నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి పేకాట ముక్కలు , రూ.6,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

మదనపల్లె : గుర్తుతెలియని వ్యక్తులు ఇంటివద్ద ఉంచిన ద్విచక్రవాహనాన్ని చోరీ చేసినట్లు అయోధ్యనగర్‌కు చెందిన కే.సుజాత బుధవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మంగళవారం రాత్రి ఇంటివద్ద నిలిపిన ద్విచక్ర వాహనం కనిపించకుండా పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

భూ ఆక్రమణలు చేస్తే క్రిమినల్ కేసులు

పెనగలూరు : మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలు, వంక, చెరువు పొరంబోకు భూములలో చెట్లు నాటితే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ శ్రీధర్ రావు హెచ్చరించారు. మంగళవారం సింగనమల గ్రామంలో సర్వే నెంబరు. 430, 257/2లలో పొరంబోకు భూమిని ఆక్రమించి మామిడి చెట్లు నాటడంతో ఆయన రెవెన్యూ సిబ్బందితో కలిసి తొలగించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో తహసీల్దార్ ప్రత్యేక సమావేశం నిర్వహించి మండల పరిధిలో ఎక్కడైనా ప్రభుత్వ భూమిని ఆక్రమించి చెట్లు నాటితే వెంటనే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని వీఆర్‌ఓలకు ఆదేశించారు. చంద్రమోహన్ రెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా 50 టాయిలెట్లు నిర్మించాం



టాయిలెట్‌ను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య

సిద్దవటం : గ్రామాలయ ప్రభుత్వేతర సంస్థ, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 50 టాయిలెట్ కాంప్లెక్స్‌ను నిర్మించామని గ్రామాలయ ప్రభుత్వేతర సంస్థ వ్యవస్థాపకులు, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ సాయి దామోదరన్ తెలిపారు. మండల కేంద్రంలోని బేల్దారి వీధిలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. వెంకటసుబ్బయ్య చేతుల మీదుగా టాయిలెట్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ మురళీధరన్, అసిస్టెంట్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ లింగ, హెల్త్ ఎడ్యుకేటర్‌లు కొరకాల సునీల్, యశ్వంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధులకు ఆదర్శప్రాయుడు 'బ్రెయిలీ'



లక్కిరెడ్డిపల్లె: మూడు చక్రాలసైకిల్‌ను అందజేస్తున్న దృశ్యం



పుల్లంపేట: బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని అంధ ఉద్యోగిని సన్మానిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె : అంధులకు లిపి కనుగొని వారి జీవితాల్లో వెలుగులు నింపిన లూయిస్ బ్రెయిలీ ఆదర్శప్రాయుడని ఎంఈఓ చక్రే నాయక్ పేర్కొన్నారు. లూయి బ్రెయిన్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక భవిత కార్యాలయంలో కేక్ కట్ చేసి పిల్లలకు పంచారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పారిస్‌లోని క్రూవే గ్రామంలో జన్మించి తల్లిదండ్రులకు తోడుగా ఉంటూ నాలుగు సంవత్సరాల వయస్సులో తన రెండు కళ్ళు పోగొట్టుకొని అంధుడయ్యాడని అన్నారు. లూయిస్ బ్రెయిలీ అంధులు ఇబ్బందులు పడకూడదని వాలంటైన్ హ్యా ప్రారంభించి లైన్ టైప్ పద్ధతిలో 12 చుక్కల లిపిని కనుగొని అందులకు విద్యను అందించారు. ఈ 12 చుక్కలు కష్టంగా ఉండటంతో ఆరు చుక్కలకు తగ్గించి అంధులకు అర్థమయ్యే రీతిలో లిపి అందించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు అంధుల పాఠశాల ప్రవేశపెట్టి ఆ పాఠశాలలో అంధులు చదువును అభ్యసిస్తున్నారని ఆయన అన్నారు. అనంతరం దివ్యాంగులకు మూడు చక్రాల సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో మన భవిత ఉపాధ్యాయుడు జనార్ధన్, సీఆర్‌పీలు చంద్రకళ, శశికళ, రామమోహన్, ఉపాధ్యాయులు బాల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవాసంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి అధ్యక్షతన లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ నరసింహకుమార్ చేతుల మీదుగా అంధుడు అటెండర్ షేక్ సిరాజ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నతుడు లూయిస్ బ్రెయిలీ అని అన్నారు. ఆయన జయంతి వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ అజయ్ బాబు, ఉపాధ్యక్షుడు వాహిద్, సంఘ సభ్యుడు మురళీ, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.